నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని పల్లంగూడకు చెందిన వెడ్మ కిషన్(34) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..కిషన్ బుధవారం ఉదయం బయటకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చాడు. స్నానం చేసేందుకు ఇంట్లోని బావి వద్ద మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెడ్మ కిషన్ మృతి పట్ల ఆదివాసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు నివాళ్లర్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నివాళ్లర్పించి సంతాపం తెలిపారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

నవతెలంగాణ నస్పూర్

విధి నిర్వహణలో గుండె పోటుతో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన ఘటన శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3 గనిలో జరిగింది. స్థానికులు తెలిపిన విరాల ప్రకారం ఎస్ఆర్పీ-3 గని మేనేజర్ వద్ద కాంట్రాక్ట్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కోటేష్(55) విధి నిర్వహణలో వాహనం నడుపుతుండగా గుండెపోటు వచ్చింది. కుప్పకూలి మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు యూనియన్ నాయకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల్లో ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంచిర్యాల ఆర్డీఓ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశమై ఎండలు ముదురుతున్నందున గ్రామ పంచాయతీల పరిధిలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ఉండాలని, పాఠశాలలను సందర్శించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి స్టాక్ రిజిస్టర్లు, పిల్లల హాజరు శాతం పరిశీలించాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా అధికారులు తమ పరిధిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్, తహసీల్దార్ వనజారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విద్యాసాగర్, వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్, వ్యవసాయ విస్తరణ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

నవతెలంగాణ-మంచిర్యాల

బెల్లంపల్లిలోని సింగరేణి క్వార్టర్లకు చెందిన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న పట్టాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సింగరేణి పాత క్వార్టర్స్‌లో నివసిస్తున్న వారితో డబ్బులు కట్టించుకుని కొంతమందికి జీవో నెంబర్ 76 ప్రకారం పట్టాలు అందించారని, డబ్బులు చెల్లించిన ఇంకా కొంతమందికి పట్టాలు రాలేదని తెలిపారు. ఇంకా చాలా మంది పాత సింగరేణి క్వార్టర్‌లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. నామమాత్రపు రుసుము తీసుకొని అందరికీ జీవో నెంబర్ 58, 59 ప్రకారంగా అందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా అర్హులందరికీ రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి మండల కార్యదర్శి, మేకల రాజేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుండా చంద్రమాణిక్యం, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కొంకుల రాజేష్, పట్టణ సహాయ కార్యదర్శి, బొంకూరు రాంచందర్, పట్టణ కార్యవర్గ సభ్యుడు రత్నం రాజ్యం పాల్గొన్నారు.

ఎండ్లబండి పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జైపూర్

కుందారం గ్రామంలో గురువారం ఎండ్లబండ్ల పోటీలను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారితో పాటు సమీప గోదావరి తీర పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు పాల్గొన్నారు. మొట్టమొదిటి సారిగా కుందారంలో ఎడ్లబండ్ల పోటీలు ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే అభినందించారు.

మేజర్ మీనాక్షిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఆర్మీలో మేజర్‌గా దేశానికి సేవలందిస్తున్న మీనాక్షి గ్రేస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. కుందారం గ్రామానికి చెందిన మీనాక్షి గ్రేస్ రక్షణ శాఖలో కెప్టెన్‌గా ఉద్యోగంలో చేరి మేజర్‌గా సేవలందించడాన్ని అభినందిస్తూ గురువారం ఆమెను శాలువాతో సన్మానించారు. మేజర్‌గా సేవలందిస్తున్న మీనాక్షి గ్రేస్ నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు.

నీటి ట్యాంకుల నిర్మాణానికి స్థలాల పరిశీలన

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో నీటి కుంటల నిర్మాణానికి అనువైన స్థలాలను గురువారం ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి నీటి బిందువు జల సింధువు విశిష్ట కార్యక్రమం సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల ఏర్పాటులో భాగంగా స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, త్వరలో గుర్తించబడ్డ ప్రదేశాలలో వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సివిల్ ఆనంద్‌కుమార్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, సెక్యూరిటీ అధికారి జక్కరెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.



ఆర్డర్ ఒక చోట..విధులు మరో చోట..!

- టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌లో అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేసిన ఉపాధ్యాయురాలు
- మంచిర్యాలకు బదులు ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న వైనం
- తమకేం తెలియదంటున్న మూడు జిల్లాల విద్యాశాఖాధికారులు

పదో తరగతి పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ కొనసాగుతోంది. ఈ స్పాట్ వాల్యుయేషన్‌కు విద్యాశాఖ ఆయా సబ్జెక్టులకు సంబంధించిన నిపుణులను ఎంపిక చేసి వారితో మూల్యాంకనం చేయిస్తుంది. ఒక జిల్లాకు చెందిన సబ్జెక్టు నిపుణులను మరో జిల్లాకు పంపిస్తారే తప్ప రెండు, మూడు జిల్లాలకు ఒక్క జిల్లాకు చెందిన వారినే పంపించే అవకాశం లేదు. కాని ఇక్కడ ఇందుకు విరుద్ధంగా ఒక ఉపాధ్యాయురాలు తనకు కేటాయించిన జిల్లాలో కాకుండా తన సొంత ఇంటికి దగ్గరగా ఉన్న జిల్లాకు వెళ్లి మరీ విధులు నిర్వర్తిస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే ఆ ఉపాధ్యాయురాలు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నట్లు మూడు జిల్లాల విద్యాశాఖాధికారులకు తెలియదట.



ఆదిలాబాద్‌లోని టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల ఏడో తేదీ నుండి ప్రారంభమైంది. ఇది 15 వరకు కొనసాగనుంది. ఈ స్పాట్ వాల్యుయేషన్‌కు కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాళీ క్యాంప్ నెం.3లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ఐదుగురు ఉపాధ్యాయులు మంచిర్యాల జిల్లాకు వెళ్లాల్సి ఉంది. ఇందులో ఒక ఉపాధ్యాయురాలు మంచిర్యాల జిల్లాలో కాకుండా ఆదిలాబాద్‌లో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొంటోంది. ఈ పాఠశాల నుండి వెళ్లిన మిగిలిన ఉపాధ్యాయులు మంచిర్యాల జిల్లాలో ఉండగా, ఈ ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రం ఆదిలాబాద్‌లో విధులకు హాజరవుతుండడం గమనార్హం.

ఆదేశాలకు విరుద్ధంగా ఆదిలాబాద్‌లో విధులు

మంచిర్యాలలో లేని సదరు ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్‌లో ప్రత్యక్షమైంది. ఇక్కడ ఆ ఉపాధ్యాయురాలు విధులు నిర్వర్తించే పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని మొదలుకొని ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల విద్యాశాఖాధికారుల వరకు సంప్రదిస్తే ఎవరూ కూడా తాము ఆర్డర్స్ ఇవ్వలేదని చెబుతున్నారు. మరి ఆ ఉపాధ్యాయురాలిని ఆదిలాబాద్‌లో డ్యూటీకి పంపిందెవరనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. రాజకీయ పైరవీని ఉపయోగించుకొని సదరు ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్‌కు వెళ్లిందని చూచాయగా తెలుస్తున్నా, అధికారులు మరీ అంత గుడ్డిగా ఆదేశాలు లేకుండానే ఎలా పంపించారనేది ఇక్కడ ప్రశ్న.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా..?

సదరు ఉపాధ్యాయురాలిది ఆదిలాబాద్ జిల్లా అని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయురాలు అదే జిల్లాలో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొంటుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉపాధ్యాయురాలిది మ్యాథ్స్ సబ్జెక్టు కావడంతో రోజుకు 40 పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. పది రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. అంటే సుమారుగా 400 మంది విద్యార్థుల పేపర్లను ఉపాధ్యాయురాలు దిద్దే అవకాశముంది. అధికారుల ఆదేశాలు లేకుండా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సదరు ఉపాధ్యాయురాలు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా విద్యార్థుల భవిష్యత్తుకే ప్రమాదం. అయినా విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మంచిర్యాలలోనే విధులు నిర్వర్తిస్తుందనుకుంటున్నా : అమరేందర్, ప్రధానోపాధ్యాయుడు

మా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలిని మంచిర్యాల టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు వెళ్లాలని ఆర్డర్ ఇచ్చాను. కాని ఆమె ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నట్లు నాకేం సమాచారం లేదు.

నా దృష్టికి రాలేదు : యాదయ్య, జిల్లా విద్యాశాఖాధికారి

ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నట్లు తనకు తెలియదని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి, ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి యాదయ్య స్పష్టం చేశారు. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులను మంచిర్యాలకు కేటాయించామే తప్ప ఆదిలాబాద్‌కు పంపించలేదని ఆయన తెలిపారు.

తెలుసుకొని చెబుతా : శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ, ఆదిలాబాద్

ఆసిఫాబాద్‌కు చెందిన ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న విషయం నాకు తెలియదు. నేను తెలుసుకొని చెబుతానంటూ ఆదిలాబాద్ డీఈఓ సమాధానం దాట వేశారు.

కార్పొరేట్‌లకు లాభాలు..పేదలపై భారాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- పలు చోట్ల నిరసనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు లాభాలు చేస్తూ..పేదలపై భారాలు మోపుతోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ గురువారం పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో గ్యాస్ బండ, కట్టెల పొయ్యితో నిరసన వ్యక్తం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచుతూ పేదలు, మధ్య తరగతి ప్రజల నడ్డివిరుస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ బడా వ్యాపారుల కోసం తాపత్రయపడే బీజేపీ ప్రభుత్వానికి పేదల గురించి పట్టడం లేదని అన్నారు. గ్యాస్ సబ్సిడీ సైతం తొలగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, బొజ్జ ఆశన్న, భగత్‌సింగ్‌నగర్ శాఖ కార్యదర్శి ఆర్.ప్రభు, నాయకులు కె.ఆశన్న, ఆరీఫాబేగం, రేణుక, మయూరిఖాన్, ఉస్మాన్, నగేష్, సునీత, మంగళ, అనసూయ పాల్గొన్నారు.

నిర్మల్ : కేంద్రంలో మోదీ సర్కార్ వంటగ్యాస్ ధరలు రూ.50, పెట్రోల్‌పై రూ.2 పెంచి ప్రజలపై భారం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు కట్టెల పొయ్యితో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ పెంచిన ధరలు తగ్గించకపోతే అన్ని పార్టీలు, సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అంతర్జాతీయంగా డీజిల్, గ్యాస్ ధరలు తగ్గినా దేశంలో ధరలు పెంచి ప్రజలపై భారం వేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇప్పటికే పేదలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో ఈ పెంపు మరింత భారమవుతుందని తెలిపారు. నిరసనలో పార్టీ జిల్లా నాయకులు బక్కన్న, రామలక్ష్మణ్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు రేష్మ, దేవక్క పాల్గొన్నారు.

ఖానాపూర్ : కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రో ధరలు పెంచడాన్ని నిరసిస్తూ గురువారం సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమురంభీమ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మళ్లీ ధరలను పెంచితే సామాన్యులు ఇబ్బందులు పడతారని అన్నారు. బీజేపీ విధానాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. దేశ వనరులను బడా కార్పొరేట్లకు కట్టబెడుతూ, రాయితీ కల్పిస్తూ, బకాయిలు రద్దు చేస్తూ ప్రజల మీద మాత్రం భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ధర తగ్గుతుంటే దేశంలో మాత్రం పెంచడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి పెంచిన గ్యాస్ డీజిల్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో పార్టీ నాయకులు ఎల్లయ్య, సుదర్శన్, వర్మ, కృష్ణ, కమల, గోరెబాయ్, రాజలింగు, రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు, కాలనీవాసులు

తాండూర్ : కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దాగం రాజారాం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో వంట కార్మికులతో కలిసి కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దశరథం, రాజేశం, పుష్ప, లక్ష్మి, సంఘవి, లక్ష్మీబాయి, తిరుపతమ్మ, లక్ష్మి, జుండి చిన్నక్క, సుమ పాల్గొన్నారు.



నిర్మల్‌లో..



ఖానాపూర్‌లో..



తాండూర్‌లో..

ఆదివాసుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- ఆత్మహత్య చేసుకున్న నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ-జైపూర్

వేమనపల్లి మండలం మంగనపల్లికి చెందిన ఆదివాసీ బిడ్డ నాయిని కన్నయ్య ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని దళిత, ఆదివాసి, కుల సంఘాల, సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా వేమనపల్లి మండలంలోని ఆదివాసి, దళిత కుటుంబాలకు స్వాతంత్రం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మంగనపెల్లి గ్రామంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎనగంటి చిన్నన్న, ఆయన భార్య లక్ష్మి దౌర్జన్యం కారణంగా నాయిని కన్నయ్య ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. చిన్నన్న ఆయన భార్య లక్ష్మి బూతు పురాణంతో మానసికంగా కృంగిపోయిన కన్నయ్య పురుగులమందు తాగి బలవన్మరణం పొందాడన్నారు. కన్నయ్య మృతి చెందిన ఆరు రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పెద్దలు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కన్నయ్యకు చెందిన సీలింగ్ పట్టా భూమిని చిన్నన్న కుటుంబ సభ్యులు అక్రమ మార్గంలో పట్టా చేయించుకున్నారన్నారు. వేమనపల్లి మండలంలో పెత్తందారుల ఆగడాలను అరికట్టాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు, ఆసరా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన ఎనగంటి చిన్నన్నతో పాటు ఆయన భార్య లక్ష్మిపై కేసు నమోదు చేయాలని, ప్రతి నెల చివరి వారంలో సివిల్స్ రైట్స్‌డే జరపాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ సమితి కన్వీనర్ పైళ్ల ఆశయ్య, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు, జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి, బోధిసత్వ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు దాగామ వలీ హైదర్, నాయకులు గోమాస రాజబాబు, కోండగుర్ల మల్లేష్, సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు కావిరి రవి, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు ఉంద్రాల్ల ఎల్లయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ ఉంద్రాల్ల రవి, తుడుందెబ్బ జిల్లా నాయకులు నైతం శంకర్, తలాంటి అశోక్ పాల్గొన్నారు.



తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు

నవతెలంగాణ-మంచిర్యాల



వేసవిలో జిల్లా ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చున్నంబట్టీ వాడ, నస్పూర్‌లోని 23వ వార్డు, శ్రీరాంపూర్, ఆర్కె-6, శ్రీరాంపూర్ బస్టాండ్, సీతారాంపల్లి ప్రాంతాలలో కొనసాగుతున్న అమత్ 2.0 నిర్మాణ పనులను మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా కార్యాచరణ ప్రకారంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి శుద్ధజలం అందించడం జరుగుతుందని, మిషన్ భగీరథ పథకం అందుబాటులో లేని ప్రాంతాలలో నీటి ట్యాంకర్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లు, నీటి ట్యాంకుల మరమ్మత్తులు, లీకేజీ సమస్యలపై యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి తక్షణమే పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు. అమృత్ 2.0లో భాగంగా నీటి ట్యాంకులు, మోటార్లు, పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంజూరైన సిసి రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న మహాప్రస్థానాన్ని సందర్శించి సౌకర్యాలు, కొనసాగుతున్న పనులను పరిశీలించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో రెండు బోర్ల ఏర్పాటు

నవతెలంగాణ-ఖానాపూర్



పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నూతనంగా రెండు బోర్లులను ఏర్పాటు చేశారు. గత మార్చి 31న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాలనీలో పర్యటించినప్పుడు నీటి ఎద్దడి గురించి తెలుసుకున్నారు. సమస్య తీర్చాలని అధికారులను ఆదేశించడంతో గురువారం స్థానిక నాయకులు, అధికారులు రెండు బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధోనికేనీ దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అబ్దుల్ మజీద్, నాయకులు యూసుఫ్ ఖాన్, అంకం రాజేందర్, షబ్బీర్ పాషా ఉన్నారు.

ఇంద్రవెల్లి ఎస్సైగా సాయన్న బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల నూతన ఎస్సైగా ఈ.సాయన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్సై దుబ్బాక సునీల్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయినట్టు సమాచారం. నిజామాబాద్‌లో విధులు నిర్వర్తించిన సాయన్న బదిలీపై ఇంద్రవెల్లికి వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తెలిపాలన్నారు. ఆ సాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం వేయుటకు ప్రజలు సహకరించాలని కోరారు.



పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ సాధ్యం

• ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-నార్నూర్

సంపూర్ణ పౌష్టిక ఆహారంతోనే రక్తహీనత నివారణ సాధ్యమవుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పోషణ పక్షంలో భాగంగా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నడ్డంగూడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన 1000 రోజుల పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్తహీనత, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా పోషణ పక్షం 2025 పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 8 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తహీనత బారినపడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, కేంద్రాల్లో అందించే బాలమృతం, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్డును ఐరన్, ఫోలిక్ మాత్రలను తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు తీసుకోవాలన్నారు. నార్మల్ డెలివరీ అయ్యేలా, ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు పొందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పోషణ లోపం ఏ ఊరిలో కనిపించకుండా చేసి రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దేలా అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు ఇంటింటికి తిరుగుతూ సామ్-మామ్ పిల్లలను గుర్తించి, మెరుగైన చికిత్స అందేలా చూడటంతో పాటు తల్లిపాలు, న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాను అనీమియా ముక్తగా తీర్చిదిద్దేలా ప్రతి జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలో అనిమియా పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించేలా యోగా, వ్యాయామం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల 14న నిర్వహించే వీహెచ్‌ఎన్‌డీని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతకు ముందు సీఎస్‌సీ ప్రారంభించారు. ఇందులో డీడబ్ల్యూఓ మిల్కా, తహసీల్దార్ రాజలింగం, ఎంపీడీఓ జవహార్, ఎంపీఓ సాయిప్రసాద్, సీడీపీఓ శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతి...

పూనగూడ నుంచి మాదాపూర్ వెళ్లే రోడ్డు పనులకు టెండర్‌ను పిలిచి వేసవిలోనే పనులు పూర్తయ్యేలా చూడాలని దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని నడ్డంగూడ గ్రామంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి సమస్యను విన్నవించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను గుండాల అమ్మవారి ఎక్స్‌రోడ్ దగ్గర మంజూరు చేయాలని, రైతులకు బోర్‌లు,

విద్యుత్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

110 రోజులకు చేరుకున్న రైతు దీక్ష

• వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కలెక్టర్ ఎదుట 110 రోజులుగా పోరాటం చేస్తున్న రైతు దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం తరపున జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ శాపంతో ఎకరం నర భూమి కోల్పోయిన గిరిజన రైతు, నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ముందు 110 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తుంటే కలెక్టర్ ప్రేక్షకు పాత్ర వహించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఆ రైతు కుటుంబం పొర్లుదండాలతో నిరసన తెలిపి కలెక్టర్‌ను కలిస్తే కలెక్టర్ భూమి దగ్గరికి వస్తాం మీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పినటువంటి మాటల్ని మర్చిపోయారని అన్నారు. సమస్యను పరిష్కరించి రైతునుంచి ప్రభుత్వం గుంజుకున్న భూమిని తిరిగి ఇవ్వాలని, లేనియెడల 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నిర్మల్ మండలాధ్యక్షులు బర్కుంట గంగారాం, రైతు బాధిత కుటుంబ సభ్యులు జాదవ్ గణేష్, జాదవ్ మనీషా పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్‌తో పాటు పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పడిగెల భూమన్న, తహసీల్దార్ ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో రైతును రాజుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం అంబారిపేట్ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మెన్, తహసీల్దార్‌ను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఇందులో పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేష్‌యాదవ్, జిల్లా నాయకులు సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాయకులు తాళ్లపెల్లి రమేష్, కాంగ్రెస్ నాయకులు, సత్యనారాయణ మాజీ సర్పంచ్‌లు, రేంకల రాజన్న, ఆకుల లచ్చన్న, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, పాకభూమన్న, నారాయణ, బుచ్చన్న, గంగన్న, పాక అంజన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 57 మంది లబ్ధిదారులకు రూ.21.82 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో పేదకుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. అర్హులైన బాధితులు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, పట్టణాధ్యక్షుడు నందెడపు చిన్ను, మాజీ కౌన్సిలర్లు అయ్యన్నగారి పోశెట్టి, నల్లూరి పోశెట్టి, సోన్, దిలావర్‌పూర్, మామడ, నర్సాపూర్ మండలాల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, భుజంగా శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఈటల శ్రీనివాస్, గాజుల రవికుమార్, లక్ష్మణచాంద మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నిమ్మ సాయన్న, నాయకులు అరుగుల రమణ, కటకం రాజారెడ్డి, కొట్టె శేఖర్, సబాకలీం, అంగూరు మహేందర్ పాల్గొన్నారు.

పేదకుటుంబానికి విద్యార్థుల చేయూత



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 4 రోజుల పాటు తెచ్చిన బియ్యాన్ని సంచిలో జమ చేసి ఖానాపూర్‌కు చెందిన నిరుపేద బొమ్మరేని నర్సయ్యకు గురువారం అందజేశారు. దీంతో పాటు రూ.500 జమ చేసి కూరగాయల నిమిత్తం అందచేశారు. ఇటీవల నెల క్రితం 30 కిలోల బియ్యాన్ని, రూ.1000ని నిరుపేద ఖలీల్ కుటుంబానికి ఇటీవల అందచేశారు. ఇలా సాటివారి కష్టాన్ని తీర్చుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బోనగిరి నరేందర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరోపకార గుణం, మానవత్వం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, షేక్ ఇమ్రాన్, సయ్యద్ ఫరాజ్ అహ్మద్, శోభారాణి, కిషన్ ప్రసాద్, విజయ్ కుమార్, షఫీ, రవి, చందన, లక్ష్మణ్‌రావు, స్వప్న, గంగాధర్, రమేష్, సృజన, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

రూ.1.70లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద రూ.1.70లక్షల నిధులతో నిర్మించనున్న పనులకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ భూమిపూజ చేశారు. రూ.80లక్షల నిధులను తాగునీటి సమస్య పరిష్కారానికి వెచ్చించనున్నట్టు చెప్పారు. మరో రూ.90లక్షల నిధులను డ్రైనేజీ నిర్మాణానికి కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగినప్పటికీ, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో సంవత్సరాల తరబడి లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించలేదన్నారు. నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, డీఈ సునీల్, ఏఈ విశాల్, మున్సిపల్ మాజీ చైర్మెన్ బి.గంగాధర్, భైంసా పట్టణ బీజేపీ అధ్యక్షులు మల్లేష్, నాయకులు వడ్నప్ శ్రీనివాస్, రాము, గాలి రాజు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభకు నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఇంద్రవెల్లి మండలంలోని హర్కాపూర్ గ్రామ సమీపంలో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద సంస్మరణ సభ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఇంద్రవెల్లి అమరవీరుల ఆశయ సాధన కమిటీ చైర్మెన్ కనక తులసీరామ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి స్తూపం వద్ద ప్రతి సంవత్సరంలో ఏప్రిల్ 20న సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు అధిక సంఖ్యలో ఆదివాసీ ప్రజలు, నాయకులు పాల్గొని, నివాళు లర్పించడం జరుగుతుందన్నారు. సభకు నిర్వహణకు ఐటీడీఏ నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని పీఓను కోరారు. పీఓ సానుకూలంగా స్పందించి త్వరలోనే కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నట్టు తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా కమిటీ చైర్మెన్ తులసిరామ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుడం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, రగల్ జెండా ప్రధాన కార్యదర్శి కొట్నక్ భారిక్ రావ్, లక్షెట్టిపేట్ సార్మేడి సలాం శ్యాంరావ్, రగల్ జెండా సహాయ కార్యదర్శి పూర్క చిత్రు, ప్రచార కార్యదర్శి కనక గణేష్ ఉన్నారు.


చైర్మెన్ కనక తులసీరామ్‌ను సన్మానించిన ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి


యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ అన్నారు. నార్కోటిక్, పోలీసుశాఖ సూచనల మేరకు ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనార్థలపై వీధి నాటకాన్ని గురువారం నిర్వహించారు. మత్తుకు యువత ఎలా ఆకర్షితులవుతున్నారో నాటకం ద్వారా తెలియజేశారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని చెబుతూ నాటకాలను వేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటోందన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, గంజాయి విక్రయించినా, తాగినా సమచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఇందులో కళాశాల అధ్యాపకులు కోటయ్య, అనిత, పరిక్, పృథ్వీరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహావీర్ సూక్తులను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అహింసను ప్రబోధించిన మహావీర్ సూక్తులను ఆదర్శంగా తీసుకుంటూ ముందుకు సాగాలని, జైన్ సమాజ్ అధ్యక్షుడు అజయ్ బోగవత్ అన్నారు. గురువారం మహావీర్ భవన్‌లో మహావీర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజలు చేశారు. అనంతరం హారతినిచ్చి మహావీర్ ప్రబోధనాలు, సూక్తులను విని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. జయంతి సందర్భంగా ఆధ్యాత్మిక క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జితేంద్ర లోడ, విపుల్, రుషద్, విజయ్, అమిత్, గులాబ్, నరేంద్ర చౌదరి, ధరంచౌదరి పాల్గొన్నారు.

పీఎం నరేంద్ర మోడీ హయాంలో దేశం అగ్రగామి



నవతెలంగాణ-భైంసా

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాయంలో దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్ అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భైంసా బీజేపీ మండల క్రియాశీల సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. 370 ఆర్టికల్, వక్ఫ్ బోర్డు సవరణ చట్టం, సీఏఏ, ఎన్‌ఆర్‌సీతో పాటు పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచంలోనే అభివృద్ధిలో దేశం ఐదవ స్థానానికి వచ్చిందంటే అది మోది ఘనతేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి, లోకేశ్వరం బీజేపీ మండలాధ్యక్షులు సాయన్న, మాజీ ఆత్మ చైర్మెన్ రవీందర్ రావ్, పీఏసీఎస్ చైర్మెన్ డి.శ్రీనివాస్, నాయకులు సుభాష్, బాలాజీ పటేల్, దేవిదాస్, భోజరాం పటేల్, పోల్కం సాయినాథ్, లింగన్న పాల్గొన్నారు.

జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్

సన్నబియ్యం, రబీ పంట కోతలు పూర్తయిన సందర్భంగా నీటి పారుదల-పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పథకం విజయవంతంగా పూర్తి అయిందని అన్నారు. రబీ పంట కోతలు పూర్తయిన సందర్భంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పెంబి

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మట్ట వెంకన్న, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చాడ చంద్రశేఖర్, కోశాధికారిగా గన్నరపు సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్టు రాష్ట్ర క్యాబినెట్ సెక్రటరీ రాజన్న తెలిపారు. సల్ల రమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులను సన్మానించారు.



బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని కౌట్ల(కె) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్సారెడ్డి తండ్రి గంగారెడ్డి ఇటీవల మరణించారు. గురువారం విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు సత్యనారాయణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట బోరిగాం మాజీ సర్పంచ్ రాజారెడ్డి, ముజ్గి మాజీ ఉపసర్పంచ్ ముత్యం, నాయకులు రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రం అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎంజేపీ బాలుర పాఠశాలలో ఆటలు ఆడుకుంటూ అస్వస్థకు గురై అయాన్ హుస్సేన్ అనే విద్యార్థి గత ఏడాది నవంబర్ నెలలో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యార్థి తల్లి షబానాకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తూ గురువారం నియామక పత్రం అందజేశారు.



'బిల్లు విడుదల చేయకుంటే జీపీ భవనాన్ని వేలం వేస్తా'

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రోడ్‌సావర్గం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కళ్యాణి మహేందర్ గ్రామ పంచాయతీ భవనాన్ని వేలం వేస్తానని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీపీ నూతన భవనాన్ని నిర్మించి దాదాపు రెండున్నరేండ్లు అవుతున్నా బిల్లురాక తాను అప్పుల ఊబిలో కూరుకుపోయానని పేర్కొన్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక జీవితం భారంగా మారిందని అందుకే జీపీ భవనాన్ని వేలం వేయాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సమయానికి బిల్లులివ్వకపోవడంతో అప్పులు, వడ్డీల బాధ భరించలేక ఎందరో సర్పంచులు ఆత్మహత్యకు చేరుకున్నారని గుర్తు చేశారు. జీపీ నిర్మాణానికి రూ. 20 లక్షలు ఖర్చయిందని, ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జీపీ భవనాన్ని వేలం వేస్తానని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సీపీఓకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో సీపీఓగా విధులు నిర్వహించి ఉద్యోగోన్నతిపై వెళుతున్న కొట్యా నాయక్‌ను సిబ్బందితో పాటు వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి మాట్లాడుతూ జిల్లాకు సీపీఓ చేసిన సేవలు మరువలేనివని, నాలుగు సంవత్సరాలుగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, అహ్మద్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-కెరమెరి



మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. గురువారం మండలంలోని ఖైరి, దేవపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మొక్కలు ఏపుగా పెరిగేందుకు కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతిరోజు మూడు పూటల నీరు పట్టించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో మొక్కల సంరక్షణకు గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఖైరి పంచాయతీ కార్యదర్శి శ్వేత, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి ఉన్నారు.

ట్రాన్స్‌పోర్టులు, గోదాముల తనిఖీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్టులు, గోదాంలను గురువారం పోలీసు, వ్యవసాయ శాఖాధికారులు తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్టులో నకిలీ విత్తనాలు రవాణా చేస్తుండగా బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో పోలీసులు, వ్యవసాయాధికారులు ఉమ్మడిగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఓ మనోహర్, సీఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను ట్రాన్స్‌పోర్టు యాజమానులు బుకింగ్ చేసుకోవద్దని సూచించారు. అనుమానాస్పద వస్తువులుంటే సమాచారం అందించాలన్నారు. అనంతరం విత్తన డీలర్లతో ఏడీఓ మనోహర్ సమావేశమయ్యారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడమే లక్ష్యం

- ఏఎస్పీ చిత్తరంజన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవికాలంలో జిల్లా వ్యాప్తంగా రద్దీ ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడమే తమ లక్ష్యమని ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎదుట పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీఐ రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో రద్దీ ప్రదేశాలను గుర్తించామని, వాటిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి కొరత ఎక్కువగా ఉంటుందని దాని నుండి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే చలివేంద్రాల నిర్వహణకు సంబంధించి ఏవైనా లోటు పాటు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వేసవికాలంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపో పరిధిలో నడిచే బస్సులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు నేడు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కే.వి.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు నేరుగా ఫోన్ ద్వారా డిపో మేనేజర్‌తో పంచుకోవచ్చని, 9959226006 నంబర్‌ను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-వాంకిడి

మహనీయులను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఎన్నో ప్రజా పోరాటాలు చేసి బహుజనుల అభ్యున్నతికి పాటుపడాలని భారత ప్రజాతంత్ర జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ అన్నారు. మహనీయుల మాసమైన ఏప్రిల్ నెలలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి దుర్గం దిన్కర్ గృహ ప్రవేశం చేయడం గొప్ప విషయమన్నారు. మహనీయుల సేవలను కొనియాడారు. వారు చూపిన మార్గంలో నడవాలని, వారి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, శ్రీకాంత్, శ్రావణి, జాడి తిరుపతి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా ఎంపికైన ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్‌ను కేస్లాపూర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భక్తి, సేవలు జీవితానికి పరమార్థం అని, సేవలతో మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అలయకమిటీ ప్రతినిధులు గుండ వెంకన్న, రాధాకృష్ణ చారి, ఏకీరాల శ్రీనివాస్, డాక్టర్ మధు, మురళి గౌడ్, లక్ష్మణ మూర్తి పాల్గొన్నారు.

ప్రారంభంకాని రోడ్డు పనులు

- దుమ్మూధూళితో నరకయాతన
- పట్టించుకోని అధికారులు
- సంవత్సరమైనా ప్రారంభంకాని పనులు



కంకర తేలిన రోడ్డు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలో బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్ వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలుగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా తెలంగాణ నుండి మహారాష్ట్రకు భారీ లోడుతో వాహనాలు నిత్యం పరుగులు తీస్తుండటంతో రోడ్డుస్థితి మరింత దారుణంగా మారింది. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు రోజువారీ సమస్యలుగా మారాయి. రోడ్డు పునర్నిర్మాణానికి కాంట్రాక్టు దాదాపు సంవత్సరం క్రితమే అప్పగించినా, ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. కొన్ని నెలల క్రితం మట్టిని తవ్వించి వదిలేసిన తరువాత నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఎండాకాలంలో రహదారి దుమ్ము ధూళితో నిండి ఉంది. వాహనాలు వెళ్లే ప్రతిసారీ లేచే దుమ్ముతో స్థానికులకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. పక్కనే ఉన్న వ్యాపార స్థలాలు, నివాసాలు దుమ్ముతో నిండిపోతున్నాయి. రాత్రివేళ గమనించకపోతే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపనులపై దృష్టి పెట్టని కాంట్రాక్టర్‌తో పాటు ఈ మార్గాన్ని ఉపయోగించే భారీ వాహనాలపై నియంత్రణ లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ రహదారిపై మహారాష్ట్రకు వెళ్తున్న భారీ వాహనాలు సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్నాయనిస్థానికులు చెబుతున్నారు. అయిన అధికారులు వాటిపై ఎటువంటి చర్య తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పక్కదారి మార్గంగా ఈ ప్రాంతాన్ని వాడుతూ, నియమాలు పాటించని వాహనదారులు రహదారిని నాశనం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ నాయకులపై కూడా నిరాశ

ఈ రహదారిపై తరచుగా రాజకీయ నాయకులు కూడా ప్రయాణిస్తున్న వారు కూడా ఈ సమస్యను పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్రజలతో కలిసి నడవాల్సిన నాయకులు సమస్యను గమనించినా, చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని వాపోతున్నారు. సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పున్నప్రారంభించడంతో పాటు అక్రమ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పోషణ పక్షం విజయవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి హాజరై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 8 నుండి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని, ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. మహిళ గర్భం దాల్చిన రోజు నుండి బిడ్డకు 2 సంవత్సరాల వయసు ఉండే వరకు గడిచే దశ బిడ్డ భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యక్రమాలు చేపట్టాలని, బాలింతలు, గర్భిణీలు, చిన్నపిల్లలు రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి సకాలంలో పౌష్టిక ఆహారం, అవసరమైన మందులు అందించి వారి ఆరోగ్య స్థితిగతుల్లో వృద్ధి తీసుకురావాలని తెలిపారు. గర్భిణులు ప్రతినెలా బరువు పరిశీలించుకోవాలని, సమయానుసారంగా అవసరమైన పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. పిల్లలలో మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పిల్లల బరువు, ఎత్తు, చుట్టుకొలతలు పరిశీలించి ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో పౌష్టిక ఆహారం, మందులు అందించి సాధారణ స్థితికి తీసుకురావాలని సూచించారు. ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల సహకారంతో పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అంగన్‌వాడీల ద్వారా మహిళలు, పిల్లల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ ఉమర్ హుస్సేన్, మెప్మా పీడీ మోతిరామ్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధి హామీ పనులు చేపట్టే ప్రదేశాలలో కూలీలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పూర్తి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. గురువారం ఆయన డీఆర్‌డీఓ దత్తారావుతో కలిసి కాగజ్‌నగర్ మండలం కోయవాగు పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండల తీవ్రత అధికంగా ఉందని, కూలీలకు తాగునీరు. నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కూలీలకు వంద రోజుల పని ఖచ్చితంగా కల్పించాలని అన్నారు. యువతకు ఆర్థిక చేయూత అందించి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువవికాసం ద్వారా అవకాశం కల్పిస్తోందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 14 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం చింతగూడ పంచాయతీ పరిధిలోని నర్సరీలో పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృశ్రీ డిగ్రీ కళాశాల వీడ్కోలు వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల వీడ్కోలు వేడుకలు స్థానిక తాటియా గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికానికి తలొగ్గకుండా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, డైరెక్టర్లు లింగమూర్తి, పవన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్లకు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లు వివక్షకు గురవుతున్నారని, వారి పట్ల జరిగే అన్యాయాలను నిరోధించేందుకు కమిషన్ ఏర్పాటు చేయల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలోని పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు విశ్వప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బజారువాడిలో పార్టీ మండల అధ్యక్షుడు చరణ్ అధ్యక్షతన నిర్వహించిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసే రాజ్యాంగాన్ని మార్చే పనిలో పడిందని ఆరోపించారు. రాజ్యాంగ రచన పూర్తయి 75 సంవత్సరాలు జరుపుతున్న నేపథ్యంలో దాని ఆవశ్యకతను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. ఐక్యంగా ముందుకు సాగి దాని నిజతత్వాన్ని అలాగే ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ప్రెసిడెంట్ షైక్ అసద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, నాయకులు గదవేణి మల్లేష్, అబ్దుల్లా, రాపర్తి కార్తీక్, నాయకులు పాల్గొన్నారు.

డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి.. కౌన్సెలింగ్ చేసి..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

షీ టీం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు, మహిళా ఎస్సై శిరీష ఆధ్వర్యంలో ప్రయాణ ప్రాంగణం ఆవరణలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి విద్యార్థినులను, మహిళలను వేధించే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం మహిళలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థినులను మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మహిళలు, విద్యార్థినీలను ఆకతాయిల వేధింపులకు గురైతే డయల్ 100కు గానీ షీటీం నంబర్ 8712670564కు గానీ ఫోన్ చేసి లేదా వాట్సాప్ మెస్సేజ్ ద్వారా సమాచారం ఇవ్వాలని వివరించారు. ఈ ఆపరేషన్‌లో షీటీం సిబ్బంది స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన యువకుడు చౌదరి జయేందర్ అదృశ్యమయ్యాడు. ఏప్రిల్ 9న రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన జయేందర్ అప్పటి నుండి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తండ్రి చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, యువకుడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కమలాకర్ తెలిపారు. సిర్పూర్ పోలీసుల నంబర్ 87126 70544 కాల్ చేయాలని కోరారు.

హనుమాన్ జయంతి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రేపు కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించే హనుమన్ జయంతి ఉత్సవాలు ఆహ్వాన శుభ పత్రికను ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు అరిగెల నాగేశ్వరరావులు జిల్లా కేంద్రంలో వేరువేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతాయని, వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండ వెంకన్న, ఆలయకమిటి ప్రముఖులు పిన్న వివేక్, ఏకీరాల శ్రీనివాస్, చిలుకూరి రాధాకష్ణ చారి, డాక్టర్ మధు, మురళి గౌడ్, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

పాఠశాల సందర్శించి.. ఆదేశాలు జారీ చేసి..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బాబాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రెటరీ తిరుపతి సందర్శించి విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలంటూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. డార్మెంటరీ, వంటశాల, నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించినంతరం సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో కోర్సులకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఖాళీల భర్తీ కోసం విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న బీఏహెచ్ఈపీ, బీజడ్‌సీ, ఎం బీజడ్‌సీ, బీకాం(సీఏ), ఎంపీసీ, ఎంపీసీఎస్ గ్రూపులలో ప్రథమ సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ అవకాశాలతో పాటు వృత్తి విద్యా కోర్సులు, ఉన్నత విద్య కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సెల్ నెంబర్ 7901097690, 8978628830ల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారికంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని బీసీ కుల నాయకులు పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సన్న బియ్యంతో భోజనం చేసిన అధికారులు

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందిస్తుందని మండల తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేవునిగూడ గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారులు మడావి బాదిరావు, లింగారెడ్డిలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం అందిస్తుందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమార్ షరీఫ్, డిప్యూటి తహసీల్దార్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి సరిత, మండల సర్వేయర్, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

నవతెలంగాణ-జైపూర్



భీమారం మండల కేంద్రంలో గల సుంకరిపల్లికి చెందిన జుమ్మిడి తిరుపతి కుటుంబానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేసినట్లు ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ వేల్పుల శ్రీనివాస్ తెలిపారు. వెంకటేశ్వర ఎస్సీ వెల్ఫేర్ సభ్యులతో కలిసి గురువారం జుమిడి తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కిలోల బియ్యం అందజేసినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన జుమిడి తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ వైస్ చైర్మెన్ జాడి రమాదేవి, కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్, ఎన్‌సీడబ్ల్యుసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జీ శడంశెట్టి రమేష్, నాయకులు కొత్తపెల్లి సత్తి రెడ్డి, కొరివి తిరుపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన భుఖ్య రమేష్ (44) ఆర్టీసీ కండక్టర్ గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. వివరాలలోకి వెళితే భుఖ్య రమేష్ ఐదు సంవత్సరాలుగా ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం డ్యూటీ చేసుకొని ఇంటికి వచ్చి రాత్రి పడుకొని తెల్లవారుజామున జాతిలో నొప్పి వస్తుందని భార్యకు తెలియజేశాడు. ఆమె వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆ వైద్యుడు తెలిపారు. మృతునికి భార్య అంజలి, 22 ఏండ్ల కుమారుడు రఘువీర్, 20ఏండ్ల కూతురు సోని ఉన్నారు. సంవత్సర క్రితం కూతురు వివాహమైంది. కుమారుడు రఘువీర్ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని మృతితో వారి కుటుంబం, మొర్రిగూడ విషాద ఛాయలు అలుముకున్నాయి.

గ్రూప్-1 ఉద్యోగం సాధించిన క్రాంతికి సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

గ్రూప్-1 ఉద్యోగం సాధించిన దుర్గం క్రాంతిని(ఫ్రెండ్స్ సేవింగ్ సొసైటీ సభ్యులు సన్మానించారు. మందమర్రికి చెందిన దుర్గం సుజాత రమేష్ దంపతుల కుమారుడు క్రాంతి గ్రూప్-1 ఫలితాలలో 552.5 ర్యాంకు సాధించిన సందర్భంగా ఫ్రెండ్స్ సేవింగ్ సొసైటీ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో తల్లిదండ్రుల కష్టాలను గుర్తించుకొని జీవితంలో మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని లక్ష్యం పెట్టుకుని పదో తరగతి 9.7జీపీఏ సాధించారన్నారు. తిరుపతిలో డిప్లమా మైనింగ్ పూర్తిచేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా గోల్డ్ మెడల్, రూ.30 వేల ట్యాబు స్వీకరించారు. డిప్లమా పూర్తయిన వెంటనే సింగరేణిలో ఓవర్ మాన్‌గా ఉద్యోగం సాధించి మరోసారి అందరి మన్ననలు పొందుతూ ఉద్యోగం చేస్తూనే బీటెక్, డిగ్రీ పూర్తి చేసి ఎన్నో కష్టాలను భరిస్తూ గ్రూప్-1లో ఉన్నత ర్యాంకు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియడారు. కష్టపడి చదివించిన తల్లితండ్రులకి బహుమతి అందజేశాడన్నారు. ఇందులో ఫ్రెండ్స్ సేవింగ్ సొసైటీ సభ్యులు శనిగారపు కుమార్, దుర్గం స్వామి, కాదాస్ రవీందర్, కోల రాజేష్, దుర్గం రవి, గొర్ల శ్రీనివాస్, పూసల సంపత్ ఉన్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఈనెల 14న మండల కేంద్రంలో నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. 14 ఉదయం నుంచి సాయంత్రం వరకు అంబేద్కర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఏ ఉత్సవాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉద్యోగ ఉపాధ్యాయులు, దళితులు మేధావులు మహిళా సంఘాలు, అందరు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు ప్రభుదాస్, ఇందయ్య, ప్రసాద్, రాజేశ్వర్, కరుణాకర్, పాత బాలరాజు, రమేష్, ప్రశాంత్, వెంకటేష్, శివ ప్రభుదాస్ పాల్గొన్నారు.

రేషన్ షాపు వద్ద పీఎం ఫొటో ఉండాలి



నవతెలంగాణ-జైపూర్

ప్రజలకు రేషన్ షాపు ద్వార పంపిణీ చేస్తున్న బియ్యం కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని బీజేపీ మండల అధ్యక్షులు దూట రాజ్‌కుమార్ అన్నారు. గురువారం వేలాల గ్రామంలో గల రేషన్ షాపు వద్ద ప్రధాని మోడీ ఫ్లెక్సి ఏర్పాటు చేసిన ఆయన కేంద్రం పంపిస్తున్న బియ్యం కాంగ్రెస్ పార్టీ పంపిణీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆలోచనా విధానంతోనే రేషన్ బియ్యం పంపిణీ జనుగుతుందన్నారు. ప్రజలు ఇది గుర్తించాలన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద ప్రధాని మోడీ చిత్ర పటం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేముల రమేష్ గౌడ్, ఆకుదారి స్వామి, ఓబీసీ మండల అధ్యక్షులు వేముల తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులు పెనుకుల శ్రీకాంత్, రామగిరి రాము, ప్యాగ మొగిలి, చందు, లవ్‌కుమార్, సఖిలం ప్రవీణ్ కుమార్,మధూకర్, చంద్రమౌళి, తోట సాయిరాం పాల్గొన్నారు.

24న ప్రతిభా పరీక్ష

నవతెలంగాణ-జన్నారం

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 24 పీపుల్స్ ప్రోగ్రెసీవ్ ట్రస్ట్ ప్రతిభ పరీక్షను జిల్లాలో 4, 5, 6 తరగతులు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ యేటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్సులు జిల్లపెల్లి బాపు, శాత్పడి నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతి నగర్‌లో కొన్నేండ్లుగా 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన చేస్తున్న పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ రానున్న విద్యా సంవత్సరానికి 5, 6, 7 తరగతిలో చేర్చుకోవడానికి విద్యార్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతోందాన్నారు. ఇందు కోసం ఈ నెల 24 ఉదయం ఉదయం 09.30.కు జిల్లా కేంద్రంలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గుండారపు చక్రపాణి 9704634005, జిల్లా ప్రధానకార్యదర్శి గుర్రాల రాజావేణు 9491345407ను సంప్రదించాలన్నారు.

పేదలకు భారంగా గ్యాస్ ధరలు

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల : నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) నాయకులు

గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడంతో పేద ప్రజలపై భారం పడింది, పెంచిన ధరలు విరమించుకొని, అధికారంలోకి రాకముందు బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా గురువారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ, మోదీ ప్రభుత్వం ఇటీవల కార్పొరేట్ పెట్టుబడిదారులకు రూ.16 లక్షల 30 వేల కోట్ల బ్యాంకు రుణాలు మొండి బకాయిల పేరుతో రద్దు చేసి ఆ డబ్బులు మళ్ళీ బ్యాంక్‌లో జమ చేయడం కోసం మధ్యతరగతి, పేదల, చిరు వ్యాపారులపై భారం వేసిందన్నారు. ఇందులో భాగంగా గ్యాస్ సిలిండర్ ధర పెంచారని తెలిపారు. ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదల నడ్డి విరిచే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పేదలను మరింత దీన స్థితిలో మార్చేలా బీజేపీ, మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశాన్ని అభివృద్ధి చెయ్యడమంటే అదానీ, అంబానీలకు ప్రజల సంపదను కట్టబెట్టడం ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, పట్టణ నాయకురాలు దాసరి రాజేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

నస్పూర్ : కార్పొరేట్లకు బ్యాంకు రుణలు రూ.46వేల కోట్లు మాఫీ చేసి,పేదోడి గ్యాస్ ధర పెంచిన బీజేపీకి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శి జోగుల మల్లయ్య మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అదాని కుటుంబానికి రూ.46వేల కోట్ల రుణమాఫీ చేసి సామాన్యుడు నిత్యావసరంగా ఉపయోగించే గ్యాస్ ధరలను పెంచడం అత్యంత దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నమన్నారు. ప్రజలపై భారాలను మోపుతూ మోసపూరిత విధానాలను కప్పిపుచ్చుకోవడానికి మత ఉన్మాదులను రెచ్చగొడుతున్నారని, ఫాసిస్టు విధానంతో నోళ్లు మూయిస్తున్నారన్నారు. అమెరికా బెదిరింపులకు తలొగ్గి వ్యవహరిస్తున్నారని, ఇప్పటికే గ్యాస్, పెట్రోల్ ఉత్పత్తుల ధరలు అనేకసార్లు పెరిగాయన్నారు. కేంద్రం వెంటనే ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాస్, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, మొగిలి లక్ష్మణ్, దొడ్డి పట్ల రవీందర్, తంగళ్లపల్లి సురేష్, గుణిగంటి నర్సింగరావు, కొత్తపల్లి మహేష్, అల్లా లచ్చిరెడ్డి, అచ్చు హరీష్, బాకం శంకరయ్య పాల్గొన్నారు.

పథకాల అమలులో సమన్వయం పాటించాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



మహిళా భవన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలై తీరుతాయని, సమన్వయం పాటించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మిగిలివున్న మూడున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలతో పాటు ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మండల పరిధి కుందారం గ్రామంలో సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన మహిళా భవన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదగడం కోసం ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనా విధానంతో రాబోవు రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకు 50 శాతం అవకాశం కల్పించాలనే యోచనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల చదువుల కోసం సకల వసతులతో పాఠశాలు పని చేస్తున్నాయని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, గ్రామ పంచాయతీల పరిధిలో స్థానికుల అవసరాల మేరకు మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ యువ వికాస్ ద్వార అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక తోడ్పాటు అందుతుందని, ఈ నెల 14 వరకు రాజీవ్ యువ వికాస్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు మండల పరిధి వివిధ శాఖలకు చెందిన అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాయకుల తీరుపై అసంతృప్తి

కుందారంలో మహిళా భవన్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్థానిక నాయకుల తీరుపై ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నట్లుగా స్ఫురించే విధంగా ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం ఏమిటని మండిపడ్డారు. కాగా ప్రభుత్వ పథకాల పంపిణీకి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా సహించేది లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా కుందారం గ్రామానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచులు ఎమ్మెల్యే పర్యటనకు హాజరు కాకపోవడం చర్చకు దారి తీసింది. ఇద్దరు మాజీలు అసంతృప్తితో ఉన్నట్లు తెలియవస్తుండగా ఎమ్మెల్యే గ్రామానికి వస్తున్నట్లు తెల్సి కూడా వారు అక్కడికి రాకపోవడం గమనార్హం.

ఏఐసీడబ్ల్యూఎఫ్ జాతీయ నాయకునికి సన్మానం

నవతెలంగాణ-మందమర్రి



జాతీయ నాయకుడిని సన్మానించి స్వీట్లు తినిపిస్తున్న యూనియన్ల నాయకులు

రాంచీలో జరిగిన ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలో సింగరేణి నుండి జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన అల్లి రాజేందర్‌కు సివిల్ డిపార్ట్‌మెంట్, సీఐటీయూ, ఐఎన్టీయూసీ, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఫిట్ సెక్రటరీ ఎ.రాజకుమార్ మాట్లాడుతూ తనకున్న అవగాహనతో సమస్యలపై అందరినీ చైతన్యవంతం చేయడంలో రాజేందర్ ముందుంటాడని సమస్యను ఏ విధంగా పరిష్కరించుకోవాలో తెలుపుతూ సాధారణ కార్మికుడిగా తన పని తాను చేసుకుంటూనే యాజమాన్యంపై పోరాడుతున్నారని అన్నారు. చిన్న వయసులో జాతీయ కార్యదర్శిగా ఎన్నికవ్వడం చాలా సంతోషమని, సీఐటీయూ యూనియన్ యువతకు ప్రాధాన్యత కల్పించడంలో ముందుంటుందనటానికి ఇదే నిదర్శనమన్నారు. అనంతరం ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తనకు అల్లి రాజేందర్ సింగరేణిలో చేరినప్పటి నుండి తనతో కలిసి పని చేశారని, యూనియన్ల భేదభావం లేకుండా ఎవరు ఏది అడిగినా కాదనకుండా సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేస్తారని, యూనియన్లకు అతీతంగా అందరితో కలిసి ఉంటూ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. డ్యూటీలో చేరిన నుండి కష్టపడి పనిచేసే మనస్తత్వం కలవాడని ఆ విధంగానే వారికి ఈరోజు యూనియన్‌లో తగిన గుర్తింపు వచ్చిందని కొనియాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సభ్యులు మాట్లాడుతూ తన దగ్గరికి వచ్చిన వారు కాంట్రాక్టు, పర్మినెంట్ అనే తేడా లేకుండా అందరితో ఒకే విధంగా ప్రవర్తిస్తూ కలిసిమెలిసి ఉంటారని, భవిష్యత్తులోనూ పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి వారు కృషి చేయాలన్నారు. ఇందులో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి, సీఐటీయూ గౌరవ అధ్యక్షులు సత్తయ్య, అధ్యక్షులు బి.మహేందర్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ బి.కుమారస్వామి, ఆర్గనైజర్ రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్, శంకర్, ఐఎన్టీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ గట్టు నర్సయ్య, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నీరు అడుగంటింది



ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలంతో పాటు చెన్నూర్ మండలం ఆస్నాద్ వరకు సాగు నీటిని సమకూర్చాల్సిన గొల్లవాగు ప్రాజెక్టులో నీరు అడుగంటి పోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ నాయకులు కలెగూర రాజకుమార్ ఆరోపించారు. గొల్లవాగులో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోవడంతో యాసంగి పంటలకు సాగు నీటి సమస్య ఏర్పడిన తీరుతో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం గోల్లవాగు ప్రాజెక్టును సందర్శించారు. వర్షాకాలంలో వచ్చి చేరే వరద నీటిని సక్రమంగా వినియోగించకపోవడంతోనే గొల్లవాగు అడుగంటి పోయిందన్నారు. వరద నీటి నిల్వ చేసి సక్రమంగా పంటల సాగుకు సమకూర్చితే యాసంగి పంటలకు సాగు నీటిని సమకూర్చడంతో పాటు వేసవి కాలం మొత్తం పశువులు దాహార్తి తీర్చుకునే అవకాశం ఉండేదని తెలిపారు. వచ్చిన వరద వచ్చినట్లు దిగువకు వదిలిన అధికారులు సాగు నీటి సమస్యకు కారణమయ్యారని ఆరోపించారు. అదేవిధంగా ప్రాజెక్టు దిగువన సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో తప్పనసరి పరిస్థితుల్లో ప్రాజెక్టు కట్టమీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గం పరిధిలో సాగు నీటి సమస్యకు పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్ ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వం మారిపోవడంతో ప్రస్తుతం చెన్నూర్ ఎత్తిపోతల పథకం మరుగున పడిందన్నారు. ప్రభుత్వం ఏదైనా అధికారం ఎవరి చేతిలో ఉన్న సాగు నీటి సమస్యను పరిష్కరించి రైతులకు సహకరించాల్సి అవసరాన్ని స్థానిక ఎమ్మెల్యే గుర్తించాలని కోరారు. గతంలో మంజూరైన చెన్నూర్ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి నియోజకవర్గంలో సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసరి మనిదీప్, ఆకుదారి రాజన్న, భుక్య రాజేశ్ నాయక్, కలెగూర రమేష్, సుందిల్ల మల్లేష్, వడ్లకొండ పవన్ పాల్గొన్నారు.

చదువుకు వయస్సు అడ్డురాదు

- డీఈఓ ఎస్ యాదయ్య



నవతెలంగాణ-కాసిపేట

చదువుకు వయస్సు అడ్డురాదని డీఈఓ ఎస్.యాదయ్య పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని సోమగూడెం, లంబడితండా, కాసిపేట గ్రామాల్లోని అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాలను జిల్లా వయోజన విద్యాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఏ.పురుషోత్తంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను అభ్యాసకుల అభ్యసన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అభ్యాసకుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. అభ్యాసకులచే చదివించి రాపించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన చదువుకు వయసు అడ్డు రాదని, అందరూ చదువుకోవాలని, చదువుకుంటే తమ పిల్లల విద్యా ప్రగతినీ పరిశీలించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. నిత్యావసరాలకు ఎవరి మీద ఆధారపడకుండా స్వయంగా పనులు చేసుకోవచ్చని తెలియజేశారు. చదువు నేర్చుకుని అంతటితో ఆపకుండా ఓపెన్ టెన్త్, ఇంటర్ ద్వారా కూడా చదువుకునే అవకాశాలున్నాయని వివరించారు. అనంతరం జిల్లా వయోజన విద్యాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం మాట్లాడుతూ మండలం త్వరలోనే 100 శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని తాగునీటి, డ్రైనేజీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇల్లు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ చౌదరి, సత్యనారాయణ మూర్తి, డీఆర్పీలు బండ శాంకరి, కొండ జనార్ధన్, సుమన్, ఇన్‌స్ట్రక్టర్లు రాజేశ్వరి, లావణ్య, విజయ లక్ష్మీ, అభ్యాసకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను ప్రారంభించిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం రూ.45 కోట్లను విద్యకు ఖర్చు చేస్తుందని, దీనిని సింగరేణి సంస్థ ఉన్న ఏరియాలలో పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియా పరిసర ప్రాంతాలలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని, పాలిటెక్నిక్ ద్వారా డిప్లమా చేసి ఉన్నత స్థానాలకు వెళ్ళవచ్చని తెలిపారు. సింగరేణి సంస్థ కూడా పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులు వివిధ సంస్థలైన సాఫ్ట్ వేర్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, నేవీ, ఇండియన్ రైల్వేస్ లాంటి వాటిలో ఉద్యోగాలు లభించడానికి అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, ఈ శిక్షణ తరగతులను ఉపయోగించుకొని మంచి ర్యాంకు సాధించి తల్లిదండ్రులకు, శిక్షకులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సింగరేణి సంస్థ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో తోడ్పడుతుందని గుర్తు చేశారు. ఈ శిక్షణ తరగతులు ఏప్రిల్ 10వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సివిల్ జీఎం శ్రీనివాస రావు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం : ఎంఈఓ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్ జడ్పీ పాఠశాలలో ఎస్ఏ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. గురువారం తపాలాపూర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. 9వ తరగతి విద్యార్థులకు రాబోయే టెన్త్ సిలబస్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం మురళీధర్, ఉపాధ్యాయుడి తుంగూరి గోపాల్ పాల్గొన్నారు.

పొలిటికల్ సైన్స్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు రాజకీయ, పరిపాలన వ్యవస్థలపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పొలిటికల్ సైన్స్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులతో మాట్లాడారు. ముఖ్యంగా పొలిటికల్ సైన్స్ విద్యార్థులు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే గ్రూపు-1, 2 పరీక్షల్లో పరిపాలన రంగాలకు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువగా వస్తాయని తెలిపారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందాలని సూచించారు. విద్యార్థులు పౌరుల హక్కులు, విధులు, పౌర చట్టాలు, ఓటు హక్కు, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలలోని సందేహాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలను తహసీల్దార్ జ్యోత్స్న నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు కూనురాజుల సమ్మక్క, అల్లం తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్

నవతెలంగాణ-మంచిర్యాల



అంబేద్కర్ జయంతిలోపు విగ్రహం ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కొనసాగుతున్న డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను మున్సిపల్ కార్పొరేషన్ డీఈ మధుకర్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ నెల 14న అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈలోగా విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

దాహార్తిని తీర్చేందుకే చలి వేంద్రాలు

నవతెలంగాణ-కెరమెరి



పాదచారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందనిఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని హట్టి చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం బయటకు వెళ్ళిన సమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రాలు ఉపయోగపడుతాయన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలను పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై పారిస్తున్న మురుగు

- పట్టించుకునేవారు కరువు



నవతెలంగాణ-నస్పూర్

జాతీయ రహదారి 63పై మురుగు పారిస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నస్పూర్‌లోని శ్రీ వెంకటేశ్వర అవుట్ లెట్ బేకరీ తిను బండరాలను తయారు చేసి వాటి నుండి వెలువడిన మురుగు నీటిని రోడ్డుపై పారిస్తున్నారని, పట్టించుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బేకరీ ముందు నుండి వెళుతుండగా దుర్వాసనకు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని, మున్సిపాలిటీని అభివృద్ధి చేయడం కోసం కార్పొరేషన్‌గా మార్చిన ఇలాంటి సంఘటనలు చూడాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగు పారిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు తెలుసుకున్న నాయకులు



నవతెలంగాణ-మందమర్రి

ఏఐటీయూసీ నాయకులు కెకె 5 ఉద్యోగులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని గని అధికారులతో చర్చించారు. కోల్ కటింగ్ డ్రిల్ రాడ్స్ వంకరగా వస్తున్నాయని డ్రిల్ చేసే సమయంలో ఇబ్బందిగా ఉందన్నారు. డ్రిల్ రాడ్స్ బిట్స్, హ్యాండ్ గ్లౌజెస్ నాణ్యమైనవి ఇవ్వాలని కోరారు. బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ కార్మికులు కష్టపడి 106శాతం బొగ్గు ఉత్పత్తి చేసారన్నారు. కార్మికుల సౌకర్యాలు, పనిముట్లు అందుబాటులో ఉండేలా మేనేజర్‌ని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. హెచ్ఎంఎస్ నాయకులు ఏఐటీయూసీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసి యాజమాన్యాన్ని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీ సోమిశెట్టి రాజేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ విక్రమ్ సింగ్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, ఫిట్ కమిటీ నెంబర్స్ ప్రేమ్ లాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మంచిర్యాల

రెండు రోజుల క్రితం హాజీపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో వరకట్నం వేధింపులకు బలవన్మరనానికి పాల్పడిన నవ వధువు తల్లిదండ్రులను శ్రామిక మహిళ సంఘం జిల్లా కన్వీనర్ దాసరి రాజేశ్వరి గురువారం టికన్నాపల్లిలోని వారి నివాసంలో పరమర్శించారు. శృతి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలున్న అవి కఠినంగా లేకపోవడంతోనే నిత్యం ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని, నవ వధువు శృతి మృతికి కారణం అయిన భర్త, అత్తమామలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట ఐద్వా సంఘం నాయకురాలు సిడం సమ్మక్క, బోయిరే రమాదేవి ఉన్నారు.

పూలే జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించే మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని విజయవంతం చేయాలని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉదయం మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణతో పాటు ఆయన వర్ధంతిని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో చలో బస్తీ బాట

నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల ముందు డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిన ఎమ్మెల్యే డంపింగ్ యార్డుపై స్పందించడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ స్థాపన దివస్ సందర్భంగా గురువారం పట్టణంలోని అండాలమ్మ కాలనీ పట్టణ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో చలో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ఉన్న డంపింగ్ యార్డు వల్ల ఎన్నో ఏండ్ల నుండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాయకులు పట్టించుకోక పోవడంతో స్థానిక ప్రజలు, చిన్న పిల్లలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చే 15 రోజుల్లో డంపింగ్ యార్డు తరలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా ఇప్పటికీ డంపింగ్ యార్డ్ తరలింపుపై స్పందిస్తలేరన్నారు. డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘునాథ్ ఎరబెల్లి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, మాదవరపు వెంకట రమణ రావు, పచ్చ వెంకటేశ్వర్లు, స్వప్న రాణి, బియ్యాల సతీష్ రావు, మెట్టుపల్లి జయ రామరావు పాల్గొన్నారు.

రణదివే స్ఫూర్తితో దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

శ్రామిక మహిళల సమస్యల పరిష్కారానికి దివంగత విమల రణదివే నిరంతరం కృషి చేశారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విమల రణదివే జయంతి కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి నివాళులర్పించారు. ఆమె చేసిన పోరాటలను స్మరించుకుంటు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ విమల రణదివే 10 ఏప్రిల్ 1915న మహరాష్ట్రలో ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టారని చిన్న వయస్సులోనే జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని జీవితాంతం అందుకే కషి చేశారని కొనియాడారు. కార్మికవర్గ పోరాటాలతో పాటు సాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం కూడా అనుభవించారని గుర్తు చేశారు. పాలకులు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విదానాలపై ఉద్యమించాలన్నారు. మే 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను కామ్రేడ్ విమల రణదివే స్ఫూర్తితో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కే.సునీత, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.నవీన్ కుమార్, డి.వెంకటమ్మ జిల్లా నాయకులు సునీత, రత్నమాల, ముక్త సుభద్ర, కళావతి, విజయ, సుజాత, కుశవర్త, పేంటుబాయ్ పాల్గొన్నారు.



విమల రణదివే చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు

వరిధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 321 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రేడ్ ఎ రకం ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న బియ్యం పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందిస్తామన్నారు. జిల్లాలో ఈసారి 3 లక్షల 41 వేల 795 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, స్థానిక అవసరాలు, విత్తనాలు, రైస్ మిల్లర్ల కొనుగోలు పోను పౌర సరఫరాల సంస్థ ద్వారా 3 లక్షల 31 వేల 395 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఐకెపి సంఘాల ద్వారా 194, మెప్మా ద్వారా 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 121 కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలులో 82 లక్షల 98 వేల 375 గోనె సంచులు అవసరం కాగా ప్రస్తుతం అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయించిన, వినియోగించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నకిలీ విత్తనాల రవాణాను నియంత్రించేందుకు సరిహద్దులలోని చెకోపోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు.

కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

గీత కార్మికుల సంక్షేమం దిశగా ప్రభుత్వం రక్షణ చర్యలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం నాయక్‌తో కలిసి కాటమయ్య రక్ష కిట్లపై శిక్షణ పూర్తి చేసుకొని అర్హత సాధించిన నైపుణ్యత గల గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా కాటమయ్య రక్ష కిట్లపై శిక్షణ అందించి అర్హత సాధించిన వారికి రక్షణ కిట్లను అందిస్తున్నామన్నారు. ఈ రక్షణ కిట్ల వినియోగంతో 80శాతం ప్రమాదాలను నివారించవచ్చని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సిబ్బంది, గీత కార్మికులు పాల్గొన్నారు.

పోషణ పక్షం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 22వ తేదీ వరకు జరుగుతున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి సీడీపీఓలు, సమన్వయకర్తలు, సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో కొనసాగుతున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓలు విజయలక్ష్మి, రేష్మ, మనోరమ, జిల్లా సమన్వయకర్త రజిత, ప్రాజెక్టు సహాయకురాలు శ్యామల పాల్గొన్నారు.

వైద్య సేవలపై సమీక్షించి.. సూచనలు చేసి..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ విభాగంలోని ఆస్పత్రులకు ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా వైద్యాధికారి సీతారాంతో కలిసి సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలు, పివిటిజి ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారను. గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నారని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సత్వర చికిత్స అందించినప్పుడే పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించినట్లుగా భావించడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది అధికంగా ఉన్నట్లయితే సిబ్బంది కొరత ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సర్దుబాటు చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా వడదెబ్బ బాధితులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, వడ దెబ్బకు గురికాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, పంచాయితీ కార్యదర్శుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది గ్రామీణ ప్రాంతాలు, పివిటిజిలు నివసించే ప్రాంతాలకెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నీటి సంరక్షణ అందరి బాధ్యత : డీఆర్‌డీఓ



నవతెలంగాణ-సారంగాపూర్

నీటి సంరక్షణ అందరి బాధ్యతని ఇన్‌చార్జి డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం సారంగాపూర్ మండలంలోని జౌలి గ్రామాల్లో వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడార్ను భూగర్భ జలాలను పెంచడం వాటర్‌షెడ్ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ పథకం అమలయ్యే ప్రాంతంలో పడే ప్రతి చినుకునూ ఆ ప్రాంతంలోనే భూమిలోకి ఇంకేలా చేయడం జరుగుతోందన్నారు. కురిసిన వాననీరు వృథాగా పోకుండా అక్కడికక్కడే అడ్డుకట్ట వేసి చిన్న నీటి గుంటలు, అవసరం ఉన్నచోట చెక్ డ్యాం వంటి పనులు చేయడంతో భావితరాలకు నీటి కొరత లేకుండా ఉంటుందని అవగాహన కల్పించారు. అనంతరం చెట్లను నాటారు. ఇందులో ప్రత్యేక అధికారి అహ్మద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు, డీఆర్‌పీ గంగాప్రసాద్, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, డీవైఆర్ఓ నజీర్‌ఖాన్, కార్యదర్శి సాయిప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



నవతెలంగాణ-నిర్మల్

ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం మహాసభల వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏర్పడి ఏడాదిన్నర అవుతున్న సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉన్నాయన్నారు. సుమారు రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సొంత భవనాల్లేక రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల విద్యార్థులు అద్దెభవనాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యాసంస్థల్లో సరైన మౌలిక సదుపాయాల్లేవన్నారు. రాష్ట్రానికి ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించలేదని ఎద్దేవా చేశారు. మహాసభల్లో విద్యారంగ సమస్యలపై మేధావులతో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో జిల్లా కోకన్వీనర్ నితిన్, శేఖర్, చంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందితో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలతో తలెత్తకుండా చూడాలన్నారు. విధులు నిర్వర్తించే క్రమంలో బాడీ ఆన్ కెమెరాలను ధరించి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ట్రాఫిక్ సిబ్బంది మండుటెండలో విధులు నిర్వర్తిస్తున్న కారణంగా ఎండ తీవ్రత తట్టుకునేలా వారికి నాణ్యతతో కళ్లద్దాలను అందజేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి సిబ్బంది కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధులను నిర్వర్తించాలన్నారు. ట్రాఫిక్ విధులు నిర్వర్తించే క్రమంలో ప్రజలు దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్, ఎస్ఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతివేడుకలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 14న నిర్వహిస్తున్న బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. గురువారం న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలోని సంఘ భవనంలో జయంతి ఉత్సవాల పోస్టర్‌లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బహిరంగసభ, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి మాల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గడ్డం వివేక్ వెంకటస్వామి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. మాల సంఘ సభ్యులతో పాటు అంబేద్కర్ వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవ అధ్యక్షుడు మేకల మల్లయ్య, కోశాధికారి ప్రభాకర్, సీనియర్ నాయకులు బేర దేవన్న, సింగరి అశోక్, స్వామి, రవి, రాఘవేంద్ర, సభ నిర్వహకులు కాంబ్లే మనోహర్, కామరాజ్ వాఘ్మారే పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-తాండూర్

నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. గురువారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో కలిసి మారుమూల గిరిజన గ్రామం కర్నలఘట్టంలో ఏర్పాటు చేసిన సన్న బియ్యం సహపంక్తి భోజనంలో పాల్గొని మాట్లాడారు. సబ్సిడీ గ్యాస్, సన్న బియ్యం, ఉచిత ప్రయాణం, పింఛన్లు, రైతు బంధు ఉపాధి భరోసా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేసే అసంఘటిత శక్తులకు సహకరించరాదని తెలిపారు. అనుమానితులు పరిసరాల్లో సంచరిస్తే సమాచారం అందించాలని కోరారు. అనంతరం అక్కడి గిరిజనులకు సన్న బియ్యం పంపిణీ చేసి అనంతరం గిరిజన కుటుంబాలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్సై కిరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగిశంకర్, నాయకులు కారుకురి రామచందర్, దావ రమేష్ పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పివిటిజి గురుకుల బాలుర పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కారెం భద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో మొత్తం 218 సీట్లు ఖాళీగా ఉండగా, మూడో తరగతిలో 80, 4వ తరగతిలో 62, ఆరవ తరగతిలో 21, 8వ తరగతిలో 17 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30లోపు స్థానిక పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీసీ పనులు ప్రారంభించిన ఆడె గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూర్ గ్రామ మహలక్ష్మి ఆలయం వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడె గజేందర్ గురువారం మండల నాయకులతో సీసీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందులో మండల నాయకులు నాయుడి రవి, మాజీ ఎంపీటీసీలు ఉప్పు పోశెట్టి, ఎర్రెడ్ల చిన్నారెడ్డి, గడే ఉషన్న, మాజీ వీడీసీ చైర్మన్ రాందాస్, నాయకులు మహేందర్, పాలరమణ, సంగు భోజన్న, బొల్లెట్టి రాములు, పాల శంకర్, ఇసాక్, మాలిక్, ఆసిఫ్, అల్లూరి నవీన్, గడ్డం నవీన్, కుంట శంకర్, కోరమశెట్టి చిన్నయ్య, సుధీర్, అశోక్, సురేష్, రామ్, లింగన్న, ధనరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మా భూమి రథయాత్రను విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణలో 90 శాతం గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్యస్థాపనకై డాక్టర్ విశారదన్ మహరాజ్ చేపట్టే లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు గంగన్న అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి యాత్ర కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అగ్రవర్ణ పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో పార్టీ తలమడుగు మండల ప్రధాన కార్యదర్శి గంగన్న, శివకుమార్, ప్రేమ్, గోవర్ధన్, సాయికుమార్, పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ.. నగలు, నగదు అపహరణ

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణ శివారులోని కొమురం భీమ్ చౌరస్తా వద్దున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో, తర్లపాడు గ్రామ శివారులో ఉన్న అగ్గి మల్లన్న గుడిలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఎస్సై రాహుల్ గైక్వాడ్ వివరాల ప్రకారం ఆయా ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడగా, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో హుండీలోని సుమారు రూ. 5 వేల నగదు, రూ. 10,500 విలువ చేసే ఆభరణాలు దోచుకెళ్లారు. అగ్గిమల్లన్న ఆలయంలో హుండీలోని రూ. 3 వేల నగదు, రూ. 30 వేలు విలువ చేసే ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆయా ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌కు ఇంటర్ బోర్డు అధికారి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టర్ రాజర్షిషాను ఇంటర్ బోర్డు అధికారి జాదవ్ గణేష్‌కుమార్ గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఇటీవల స్కోచ్ అవార్డ్ అందుకున్న నేపథ్యంలో, ఇంటర్ మూల్యాంకనం జిల్లాలో విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సన్మానించారు. పూలమొక్కను అందజేశారు. ఇందులో భగవాండ్లు, సూర్యప్రకాష్, మోసిన్ ఉన్నారు.

శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

• అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల కోసం(యుడిఐడి) ఎంపిక శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల కోసం అర్హుల ఎంపిక శిబిరాన్ని సందర్శించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో యాడిఐడి కార్డుల మంజూరుకు రెండు రోజుల పాటు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం దృష్టిలోపం ఉన్న దివ్యాంగులకు శిబిరం నిర్వహించామని, శుక్రవారం ఆర్థోపెడిక్ విభాగపు దివ్యాంగులకు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి స్లాట్లు ఎంపిక చేసుకున్న వారంతా తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రస్తుతం శిబిరానికి 20 మంది దివ్యాంగులకు స్లాట్ బుక్ చేసుకోగా, వారిలో 12మంది మాత్రమే శిబిరానికి హాజరైనట్లు తెలిపారు. హాజరుకాని 8మంది దివ్యాంగులు మళ్లీ శిబిరాన్ని ఏర్పాటు చేసినప్పుడు ముందుగా స్లాట్లను ఎంపిక చేసుకొని రావాలని సూచించారు. దివ్యాంగులకు వారి సహాయకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శిబిరంలో అన్ని వసతులను కల్పించాలన్నారు. తాగు నీటిని అందుబాటులో ఉంచాలని అన్నారు. వైద్యులంతా దివ్యాంగుల వైకల్య ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డా. గోపాల్ సింగ్, అధికారులు సృజన్‌రెడ్డి, వైద్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ పీడీ



నవతెలంగాణ-లక్సెట్టిపేట

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు నిర్మించి ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో నాణ్యత పాటించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని హౌజింగ్ పీడీ బన్సీలాల్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆయన కాంగ్రెస్ నాయకులు, మండల అధికారులతో కలిసి పరిశీలించారు. మోడల్ హౌజ్ నిర్మాణాల గురించి తెలుసుకుంటూ అధికారులకు సూచనలు చేశారు. పేదోడి సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపడుతోందని పీడీ తెలిపారు. రూ. 5 లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేసుకోవాలో మోడల్ హౌజ్ ద్వారా లబ్ధిదారులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, మాజీ ఏఎంసీ చైర్మన్ బుచ్చన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్కర్స్ కమిటీని ఏర్పాటు చేయండి

• డీజీఎంను కలిసిన హెచ్ఎంఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిధిలో ఐడీ యాక్ట్ 1947 సెక్షన్ 3ను అనుసరించి వర్కర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని హెచ్ఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం ఎస్టీపీపీ డిప్యూటీ జనరల్ మేనేజర్ తుకారాంను కలిసి వర్కర్స్ కమిటీలో ప్రతి డిపార్ట్‌మెంట్ నుండి ఇద్దరు చొప్పున కార్మికులను చేర్చుకోవాలని అన్నారు. కార్మికుల సౌకర్యార్థం ప్లాంట్‌లో క్యాంటీన్ కమిటీ, ఎస్టీపీపీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వీటీఆర్ కంపెనీకి సంబంధించి ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ వెంటనే చేపట్టాలని కోరారు. రూ.13,800 నుండి రూ.16,800 వరకు పేమెంట్ గల ఫిక్స్‌డ్ క్యాటగిరీ కార్మికులకు డెయిలీ వేజస్‌గా సీనియార్టీ ప్రకారం సెమీస్కిల్డ్, స్కిల్డ్ క్యాటగిరీగా ప్రమోట్ చేయాలని, ఫిక్స్‌డ్ క్యాటగిరీలో ఉన్న వాళ్లకు బోనస్,

స్టాటిటరీ బెనిఫిట్స్ నష్టపోవాల్సిన పరిస్థితుల్లో రూ.21వేల పేమెంట్ దాటిన వారికి కుటుంబ సభ్యులతో కలిసి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ విక్రమ్ కుమార్, ఉపాధ్యక్షులు సాయికృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి రిక్కుల నర్సింహరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం (దేవరకోట) 68వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆ ప్రాంతమంతా గోవిందనామ స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 13వ వరకు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్తలు ఆరెచిరంజీవి, గుల్లె రాజన్న, ఒడ్నం నరేందర్, సంతోష్, అనిత, దేవేందర్‌గౌడ్, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జైపూర్

నియోజకవర్గం పరిధిలో శిక్షణ పొందిన గీత కార్మికులకు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కాటమయ్య కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. చెన్నూర్ ప్రజా పాలన భవనంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నియోజకవర్గం పరిధిలోని 70 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లు అందజేశారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం గీత కార్మికులకు ఈ కిట్లు పంపిణీ చేస్తోందని, ముందుగా కార్మికులకు ప్రభుత్వ పరంగా శిక్షణ ఇచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తమ్ నాయక్, మోసిన్ హైమద్ పాల్గొన్నారు.

మార్కెట్ తరలించే కుట్ర మానుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏజెన్సీ గ్రామపంచాయతీ రాజంపేట పరిధిలో ఉన్న జూబ్లీ మార్కెట్‌ను మున్సిపాలిటీకి మార్చే కుట్ర మానుకోవాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన జూబ్లీ మార్కెట్ ప్రస్తుతం ఏజెన్సీ గ్రామపంచాయతీ అయిన రాజంపేటకు వచ్చిందన్నారు. దీంతో ఏజెన్సీ గ్రామపంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుందని, దీనిని జీర్ణించుకోలేక కొందరు మార్కెట్ వివేకానందచౌక్‌కి మార్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కుట్రను మానుకోకపోతే ఆందోళన చేపడతామన్నారు. ఆయన వెంట తుడుం దెబ్బ నాయకులు ఉన్నారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే వాహనం సీజ్

నవతెలంగాణ-నేరడిగొండ

ట్రాఫిక్ నిబంధనలు పాటించకున్నా, వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకున్నా వాహనం సీజ్ చేయడం జరుగుతుందని ఎస్ఐ శ్రీకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం వరకు 9 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు పాటిస్తూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని వాహనదారులను కోరారు.

కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ అధికారికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అడ్వైజర్, జాయింట్ సెక్రెటరీ పల్లెర్ల శరత్‌కుమార్ ను బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.విజయ భాస్కర్ రెడ్డి గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో సన్మానించారు. శరత్‌కుమార్ గతంలో బెల్లంపల్లి ఏరియా ఎన్విరాన్‌మెంట్ అధికారిగా పని చేశారని గుర్తు చేశారు. అనంతరం పూల మొక్కను అందించారు. ఇందులో ఖైరిగూడ పీఓ నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-రెబ్బెన

పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ బుద్దేస్వామి ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎస్పీ, ఏఎస్పీ సూచనల మేరకు రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.